క్లుప్తంగా

ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్ష ఫీజు చెల్లించాలి



కుత్బుల్లాపూర్: తెలంగాణ ఓపెన్ ఎస్ఎస్‌సీ, ఇంటర్ 2022–23 విద్యా సంవత్సరంలో చేరిన విద్యార్థులు, గతంలో ఫెయిలైన విద్యార్థులు వార్షిక పరీక్ష ఫీజు చెల్లించాలని సుభాష్‌నగర్ వివేకానంద విద్యామందిర్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు, ఏఐ కో.ఆర్డినేటర్ మండవ శ్రీనివాస్‌గౌడ్ ఓ ప్రకటనలో కోరారు. పరీక్ష ఫీజు చెల్లించడానికి ఈనెల 10 చివరి తేదీ అని, ఎస్ఎస్‌సీలో సబ్జెక్టుకు రూ.100, ఇంటర్ విద్యార్థులు సబ్జెక్టుకు రూ.150 చొప్పున ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు. పరీక్ష ఫీజును మీసేవా కేంద్రంలో చెల్లించిన రసీదునును సుభాష్‌నగర్‌లోని వివేకానంద విద్యా మందిర్ హైస్కూల్‌లో అందజేయాలని కోరారు. ఇతర వివరాలకు 9866134372లో సంప్రదించాలన్నారు.

కరోనా లక్షణాలు ఉంటే పరీక్షలు చేయించుకోండి

కుత్బుల్లాపూర్: జంట సర్కిళ్ల పరిధిలో కోవిడ్–19 నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. గురువారం సూరారం కాలనీ యూపీహెచ్‌సీలో 21 మందికి కోవిడ్ పరీక్షలు చేయగా అందరికి నెగిటీవ్ రిపోర్ట్‌లు వచ్చినట్లు వైద్యాధికారులు తెలియజేశారు. ఎవరైనా తీవ్ర జ్వరం, దగ్గు, గొంతునొప్పి లక్షణాలతో బాధ పడుతుంటే వెంటనే కోవిడ్ పరీక్షలు చేయించుకుని జాగ్రత్త పడాలని సూచించారు.

కంటి వెలుగును సద్వినియోగం చేకోండి

జగద్గిరిగుట్ట: తెలంగాణ ప్రభుత్వం కంటి సమస్యలతో బాధపడుతున్న పేదల కోసం ప్రతిష్టాత్మకంగా కంటివెలుగు కార్యక్రమం చేపట్టిందని జగద్గిరిగుట్ట కార్పొరేటర్ జగన్ అన్నారు. గురువారం జగద్గిరిగుట్ట డివిజన్ మైసమ్మనగర్–బి బ్లాక్ కమిటీ హాల్‌లో సృజన వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కంటివెలుగు కార్యక్రమాన్ని కార్పొరేటర్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. ఉదయం 9గంటల నుంచి 4గంటల వరకు కొనసాగే శిబిరంలో కంటి సమస్యలున్న వారు పరీక్షలు చేయించుకోవాలన్నారు. అవసరమైన వారికి ఉచితంగా కళ్లద్దాలు అందజేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ ఆర్గనైజర్ కిషోర్, కాలనీ అధ్యక్షుడు పిల్లి ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి బండారి రవీందర్‌రెడ్డి, కోశాధికారి సంతోష్, సభ్యులు పాపిరెడ్డి, నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.

మాస్టర్ షెఫ్ పోటీలు



నిజాంపేట్: ప్రగతినగర్ మిథిలానగర్‌లోని నారాయణ ఒలింపియాడ్ స్కూల్‌లో గురువారం 'మాస్టర్ షెఫ్' పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో విద్యార్థులు హైదరాబాద్ బిర్యానీ, బాదం పాలు, గులాబ్‌జామున్, బొబ్బట్లు, సమోసా, పులిహోర, మంచూరియా, పానీపూరి, కస్టర్డ్, శాండ్‌విచ్ వంటి పలు రుచికరమైన వంటకాలను తయారు చేసి రుచి చూపించారు. ఈ సందర్భంగా పాఠశాల ఏజీఎం వైజయంతి పోటీల్లో పాల్గొన్న విద్యార్థులను అభినందించారు.

వీఆర్‌ఏ సమస్యల పరిష్కారానికి పాటుపడండి

మేడ్చల్‌రూరల్: మేడ్చల్ మండలానికి చెందిన వీఆర్‌ఏలు తమ సమస్యలు పరిష్కరించేందుకు పాటుపడాలని కోరుతూ గురువారం బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌ను కలిసి వినతి పత్రం ఇచ్చారు. పూడూర్ గ్రామ పరిధిలోని ఈటల నివాసానికి వెళ్లిన వీఆర్‌ఏలు అసెంబ్లీ సమావేశాల్లో తమ సమస్యలపై గళం విప్పాలని విజ్ఞప్తి చేయగా ఇందుకు ఈటల సానుకూలంగా స్పందించారు. ఈటలను కలిసిన వారిలో వీఆర్‌ఏలు మోహన్, శ్రీనివాస్, కుమార్, నవీన్, తదితరులు ఉన్నారు.

ఆర్టీసీలో అద్దె బస్సుల డ్రైవర్లకు శిక్షణ

మేడ్చల్: ఆర్టీసీలో అద్దె బస్సులు నడిపే డ్రైవర్లకు మేడ్చల్ డిపోలో ట్రాఫిక్ పోలీసులు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. డ్రైవర్లు తప్పకుండా ట్రాఫిక్, రోడ్డు భద్రతా నియమ, నిబంధనలు పాటించాలని ట్రాఫిక్ సీఐ నర్సింహా రెడ్డి కోరారు. డ్రైవర్లు నిబంధనలు పాటిస్తే ప్రమాదాలు జరగవని, సెల్ ఫోన్, ర్యాష్ డ్రైవింగ్ ఎట్టి పరిస్థితుల్లో చేయొద్దని అన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఆర్ఎంఐ రవిశంకర్‌రెడ్డి, డీఎం సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ట్రాఫిక్ సీఐ నర్సింహారెడ్డి

రీసైక్లింగ్ పరిశ్రమలు తరలించరు

ప్రమాదాలు నిలువరించరు

ఆ బస్తీలో అడుగు పెడితే అన్నీ రీసైక్లింగ్ పరిశ్రమలే. ఎక్కడ చూసిన రసాయన డ్రమ్ములు, ప్లాస్టిక్ కవర్లు. అక్కడకు వెళ్తే రసాయనాల దుర్వాసన. ఇవన్నీ రీసైక్లింగ్ యూనిట్‌లు ఎక్కడో లేవు జీడిమెట్లకు ఆనుకుని ఉన్న సుభాష్‌నగర్‌లోని గంపలబస్తీలో ఉన్నాయి. నివాసాల మధ్యలోనే పుట్టగొడుగుల్లా వెలిశాయి. అందుకే ఈ బస్తీని రీసైక్లింగ్ పరిశ్రమల బస్తీ అని కూడా అంటుంటారు.



గంపలబస్తీలోని రీసైక్లింగ్ యూనిట్‌లు

జీడిమెట్ల: అక్కడ ఉన్న ప్రజలు పొట్టకూటి కోసం వారి ప్రాణాలు ఫణంగా పెట్టి అక్కడ బతుకులు వెల్లదీస్తున్నారు. అక్కడ ఉన్న ప్రజలు రీసైక్లింగ్ యూనిట్‌లలో పనులు చేస్తే గాని వారి జీవనం గడవదు. ఇంకా చేసేదేమిలేక అక్కడే జీవిస్తున్నారు.

- ఎక్కువగా అక్కడ నివసించే ప్రజలు బీహార్, ఒరిస్సా, మధ్యప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన వారే. వివిధ రాష్ట్రాల నుంచి పొట్టకూటి కోసం ఇక్కడకు వచ్చి రీసైక్లింగ్ యూనిట్‌లలో రోజు వారి కూలీలుగా పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు.

వీరి బతుకులు గాల్లో దీపాలే..

ఏ క్షణం ఏ ప్రమాదం సంభవిస్తుందో తెలియదు. ఇక్కడి ప్రజలు రసాయన డ్రమ్ములను కట్ చేసే సమయంలో రసాయనాల చర్య వలన డ్రమ్ములు పేలుతుంటాయి. ఇది ప్రమాదం అని తెలిసినప్పటికి పొట్టకోసం ఇక్కడ కూలీలు ఇక్కడి రీసైక్లింగ్ యూనిట్‌లలో పనులు చేస్తూనే ఉంటారు.

- ఇప్పటికే గంపలబస్తీలో 2016లో ఇద్దరు వ్యక్తులు ఇలాంటి ఘటనలో మృతి చెందారు. 2018లో ఓ వ్యక్తి మృతిచెందగా మరో వ్యక్తి గాయపడ్డాడు. 2021లో డ్రమ్ము పేలడంతో ఓ వ్యక్తి చేతి వేళ్లు తెగిపడ్డాయి. 2022లో ఓ యూనిట్‌లో డ్రమ్ము పేలడంతో కాలిన గాయాలతో సదరు వ్యక్తి గాంధీ అస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు.
- 2023 జనవరి 31న జరిగిన పేలుడులో విజయ్ ప్రజాపత్(35) అనే వ్యక్తి తీవ్రంగా గాయపడి అక్కడికి అక్కడే మృతి చెందాడు. ఇలా ఇప్పటికే ఇక్కడ జరిగిన ప్రమాదాల్లో రోజువారి కూలీలు పదుల సంఖ్యలో ప్రాణాలు కోల్పోయారు.
- **వరుస అగ్నిప్రమాదాలు.. స్పందించని అధికారులు**

గంపలబస్తీలోని రీసైక్లింగ్ యూనిట్‌లలో తరచూ అగ్నిప్రమాదాలు సంభవిస్తూనే ఉంటాయి. ఎప్పుడు ఏ యూనిట్‌లో అగ్నిప్రమాదం జరుగుతుందో తెలియదు. ఒకవేళ అనుకోకుండా రాత్రిపూట పెద్ద ప్రమాదం జరిగితే అక్కడ నివాసం ఉండే ప్రజల ప్రాణాలకు నష్టం వాటిల్లే ప్రమాదం లేకపోలేదు. కావున గంపలబస్తీలో ఉన్న అనుమతులు లేని రీసైక్లింగ్ యూనిట్‌లను కుత్బుల్లాపూర్ మున్సిపల్ అధికారులు అక్కడ నుంచి తొలగించాలని సుభాష్‌నగర్ ప్రజలు కోరుతున్నారు. ఇంత జరుగుతున్న అధికారులు పట్టించుకోకపోవడంపై స్థానిక ప్రజలు అధికారులపై అసహనం వ్యక్తం చేస్తున్నారు.



డ్రమ్ము పేలడంతో మృతి చెందిన కార్మికుడు విజయ్ ప్రజాపత్

అధికారులు పట్టించుకోవాలి..



జనావాసాల మధ్య ఉన్న రీసైక్లింగ్ యూనిట్‌లను గంపలబస్తీ నుంచి తరలించాలని పట్టణ ప్రగతి కార్యక్రమంలో పాదయాత్ర నిర్వహించి అధికారులకు చూపించాం. అయినా అధికారులు పట్టించుకోవడం లేదు. అమాయకుల ప్రాణాలు పోతున్న మిన్నకుండిపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు పట్టించుకుని రీసైక్లింగ్ యూనిట్‌లను సుభాష్‌నగర్ నుంచి తరలించాలి. – పోలె శ్రీకాంత్, సుభాష్‌నగర్

ప్రభుత్వ స్థలాల్లో కొనసాగుతున్న కూల్చివేతలు



సర్వే నంబర్ 342లో బేస్మెట్లను తొలగిస్తున్న రెవెన్యూ సిబ్బంది



సర్వే నం.329/1లో వెలిసిన నిర్మాణాలు

సుభాష్‌నగర్: గాజులరామారం డివిజన్ దేవేందర్ నగర్ లోని ప్రభుత్వ స్థలాల్లో వెలసిన నిర్మాణాలకు పరంపర కొనసాగుతూనే ఉంది. రెండు రోజుల నుంచి కుత్బుల్లాపూర్ రెవెన్యూ అధికారులు పదుల సంఖ్యలలో గదులను, బెస్‌మెంట్లను కూల్చివేయగా, తాజాగా గురువారం సర్వే నంబర్.342లో వెలసిన ఆరు బేస్‌మెంట్లను నేలమట్టం చేశారు.

ఒకవైపు కూల్చివేతలు మరోవైపు కట్టడాలు...

ఒకవైపు రెవెన్యూ అధికారులు ప్రభుత్వ స్థలాల్లో వెలిసిన నిర్మాణాలను కూల్చివేసి వారిపై కేసు నమోదు చేస్తుంటే.... మరోవైపు కబ్జాదారులు తగ్గడం లేదు. సర్వే నంబర్ 329/1 లో ఇటీవల రెవెన్యూ అధికారులు కూల్చివేతలు చేపట్టినప్పటికీ నిర్మాణాలు ఆగడం లేదు. ఈ విషయమై రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పరమేశ్వర్‌రెడ్డిని వివరణ అడగగ ఇప్పటికే తాజాగా 5 గదులను కూల్చి వేస్తామని, మిగతా వాటిని గుర్తించి రెండు రోజుల్లో కూల్చివేసి కేసు నమోదు చేసుకోవాలని తెలిపారు.

అందుబాటులోకి సూరారం బౌరంపేట రోడ్డు

సుభాష్‌నగర్: ఎన్నో ఏళ్లుగా చూస్తున్న సూరారం విలేజ్ నుంచి విశ్వకర్మ మీదుగా బౌరంపేటకు వెళ్లే రోడ్డు అందుబాటులోకి వచ్చింది. విశ్వకర్మ నుంచి గండి మైసమ్మ మియాపూర్ వెళ్లే ప్రధాన రోడ్డుకు అనుసంధానం చేస్తూ 1.5 కిలోమీటర్ల పొడవును రూ.1.7 కోట్ల వ్యయంతో వెచ్చించి అందుబాటులోకి తెచ్చారు. తాజాగా వేసిన ఈ రోడ్డు అటవి మార్గం గుండా ఉండటం వలన కొన్ని సంవత్సరాలుగా అభివృద్ధికి నోచుకోలేదు. దీంతో 125, 126 జీవోల ప్రకారం నూతనంగా ఈ రోడ్డును విస్తరించారు. దీంతో సూరారం బౌరంపేట్ వెళ్లే వారికి మార్గం సుగమమైంది.



విశ్వకర్మ కాలనీ నుంచి గండిమైసమ్మ మియాపూర్ ప్రధాన రోడ్డు వరకు వెడల్పు చేసిన రోడ్డు

కార్మికుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం

నిజాంపేట్: మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ఏఐటీయూసీ రాష్ట్ర సమితి సభ్యుడు పాలబిందెల శ్రీనివాస్ అన్నారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో శుక్రవారం చేపట్టనున్న ×చలో హైదరాబాద్ొకార్యక్రమాన్ని విజయవంతం చేయాలని గురువారం మున్సిపల్ అధ్యక్షుడు ఆశి యాదయ్య అధ్యక్షతన నిజాంపేట్ వార్డు కార్యాలయంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. జీవో.4ను అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని న్నారు. కార్మికులకు కనీస వేతనం రూ.24వేల అమలుతో పాటు కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలన్నారు. వారికి ఈఎస్ఐ, పీఎఫ్ సదుపాయాలు కల్పించాలన్నారు. చలో హైదరాబాద్ కార్యక్రమానికి కార్మికులు పెద్ద సంఖ్యలో హాజరై తమ గళాన్ని ప్రభుత్వానికి వినిపించాలని కోరారు. అనంతరం నిజాంపేట్ కార్పొరేషన్ ఇన్‌చార్జ్ కమిషనర్ రామకృష్ణారావుకు డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందజేశారు. ఈ సమావేశంలో మున్సిపల్ నాయకులు భాగ్యమ్మ, నర్సమ్మ, అమృతమ్మ, సతమ్మ, కౌసల్య, నాగయ్య, దుర్గయ్య, శివ కుమార్, మహేష్, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



నిజాంపేట్ ఇన్‌చార్జ్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

ముగిసిన ఇందిరాగాంధీ స్మారక స్పోర్ట్స్ మీట్

రంగారెడ్డినగర్: హెచ్ఎంటీ గ్రౌండ్స్‌లో రెండు రోజులుగా ఎస్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇందిరాగాంధీ స్మారక మండల స్థాయి స్కూల్ స్పోర్ట్స్ మీట్ ఆదివారం ముగిసింది. బాలికల విభాగం కబడ్డీలో స్వామి వివేకానంద హైస్కూల్ విజేతగా, రన్నర్స్‌గా సీఎంఆర్ హైస్కూల్, అదే విధంగా బాలికల ఖోఖోలో సీఎంఆర్ స్కూల్ విజేతగా, శ్రీచైతన్య విద్యానికేతన్ రన్నరప్‌గా నిలిచాయి. బాలూర క్రికెట్ పోటీల్లో విజేతగా చైతన్య విద్యానికేతన్ హైస్కూల్, కృష్ణవేణి హైస్కూల్ రన్నరప్‌గా, బాలూర కబడ్డీలో ఎంబీ గ్రామర్ హైస్కూల్, రన్నరప్‌గా స్వామి వివేకానంద్ హైస్కూల్, బాలుర ఖోఖోలో సీఎంఆర్ హైస్కూల్ విజేతగా, చైతన్య విద్యానికేతన్ హైస్కూల్ జట్టు రన్నరప్‌గా, బాలూర వాలీబాల్‌లో విజేతగా సీఎంఆర్ హైస్కూల్, రన్నరప్‌గా చైతన్య విద్యానికేతన్ హైస్కూల్ జట్టు విజేతలుగా నిలిచాయి. విజేతలుగా నిలిచిన జట్లు, రన్నరప్ జట్లకు ఎన్ఎస్‌యూఐ ప్రతినిదులు ట్రోఫీలు, బహుమతులు అందజేశారు.



బాలికల ఖోఖోలో విజేతగా నిలిచిన సీఎంఆర్ స్కూల్ జట్టు

బడ్జెట్‌లో దళితులకు ద్రోహం

నిజాంపేట్: కేంద్ర బడ్జెట్‌లో సంక్షేమ పథకాలు ఎత్తివేయడం, ఉపాధి నిధులను భారీగా తగ్గించడం, జనాభా దామాషా ప్రకారం నిధులు కేటాయించడంలో దళితులకు కేంద్ర ప్రభుత్వం ద్రోహం చేసిందని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బాలపీరు అన్నారు. గురువారం బడ్జెట్‌లో దళితులకు సరైన న్యాయం జరగలేదని ఆరోపిస్తూ బాచుపల్లిలో కేవీపీఎస్ నాయకులు బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా కేవీపీఎస్ నాయకులు మాట్లాడుతూ... దేశంలో 20 శాతం ఉన్న దళితులకు బడ్జెట్‌లో కేవలం 16 శాతం మాత్రమే కేటాయించారన్నారు. గత బడ్జెట్‌లో ఉపాధి హామీ చట్టానికి రూ.89400 కోట్లు కేటాయిస్తే ప్రస్తుత బడ్జెట్‌లో రూ.60వేలకు కుదించారని ఆవేదన వ్యక్తం చేశారు.

- సంక్షేమ పథకాల్లో సైతం భారీ కోత విధించడంతో దళితుల సాధికారత ఎలా సాధ్యపడుతుందన్నారు. విద్యా, వైద్యం, ఉపాధి, ఇళ్ల స్థలాలు, తాగు నీటి వసతి వంటి సౌకర్యాలకు బడ్జెట్‌లో కేటాయించలేదన్నారు. 2023 బడ్జెట్‌లో దళితులు ఆర్థిక అణిచివేత, వివక్షకు గురయ్యారని ఆరోపించారు. దేశంలో దళితుల అక్షరాస్యత కేవలం 58 శాతం మాత్రమే ఉందని తెలిపారు. ఈ బడ్జెట్‌లో వారి విద్యకు ఒక్క రూపాయి పెంచలేదని పేర్కొన్నారు. దేశ వ్యాప్తంగా 3.25 కోట్ల మందికి ఇళ్ల నిర్మాణం చేపడతామన్న ప్రభుత్వం బడ్జెట్‌లో నిధులు ఎందుకు పెంచలేదని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్ష కార్యదర్శులు స్వామి, మల్లికార్జున్, మండల నాయకులు కృష్ణయ్య, ప్రసాద్, సాయికుమార్, రాజు, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.



కేంద్ర బడ్జెట్ ప్రతులు దహనం చేస్తున్న కేవీపీఎస్ నాయకులు

సీసీ రోడ్డు పనులు త్వరగా పూర్తి చేయాలి

బాలానగర్: బలానగర్ డివిజన్ పరిధిలోని వినాయక్‌నగర్‌లో జరుగుతున్న సీసీ రోడ్డు పనులను గురువారం కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పనులను నాణ్యతా ప్రమాణాలతో త్వరగా పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ రాములు, బీఆర్ఎస్ నాయకులు మొహమ్మద్ కాజా, యాదగిరి, నర్రా దేవేందర్‌రెడ్డి, మొహమ్మద్ బాబా, నాగేందర్‌గౌడ్, కాలనీ అధ్యక్షుడు సిద్ధిరాములు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రతిభాపాటవాలను వెలికితీయాలి

బాలానగర్: విద్యార్థుల్లో దాగి ఉండే ప్రతిభా పాటవాలను వెలికి తీసి ప్రోత్సహిస్తే మన దేశానికి వారే దిక్సూచి అవుతారని అప్సా ఫౌండేషన్ సంస్థ హైదరాబాద్ మేనేజర్ బస్వరాజ్ అన్నారు. గురువారం బాలానగర్ జెడ్పీహెచ్ఎస్‌లో గతేడాది పదో తరగతి ఫలితాల్లో స్కూల్ టాపర్లుగా నిలిచిన ప్రగతి, శృతిలకు రూ.3వేల చొప్పున చెక్కులను అందజేశారు.

కార్మికులకు అనుమతి ఇవ్వాలి

బాలానగర్: తెలంగాణ రాష్ట్ర మున్సిపల్, అవుట్ సోర్సింగ్ నాయకులు గురువారం చలో హైదరాబాద్ కార్యక్రమానికి సహకరించాలని డిప్యూటీ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఫిబ్రవరి 3వ తేదీన జరుగే చలో హైదరాబాద్ కార్యక్రమానికి పారిశుద్ధ్య కార్మికులను అనుమతించాలన్నారు. కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులకు జీవో.4 ప్రకారం రూ.24వేల వేతనం, కార్మికుల రెగ్యులరైజేషన్, ఈఎస్ఐ, ఈపీఎఫ్ సక్రమంగా అమలు చేయాలనే డిమాండ్‌తో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు జి.కృష్ణ, దావీదు, హరినాథ్, డి.రాములు, వి. శ్రీనివాస్ పాల్గొన్నారు.

రోడ్డు దాటుతాం.. ఐదడుగుల డివైడర్ తొలగించండి

సుభాష్‌నగర్: సూరారం నారాయణ హాస్పిటల్ వద్ద ఉన్న బస్టాప్‌లో కాలనీ వికలాంగులు, అంధులు బస్సు దిగుతారు. కాలనీకి వెళ్లాలంటే రాంగ్ రూట్‌లో నడుచుకుంటూ వెళ్లి రోడ్డు దాటాల్సి వస్తోంది. ఇదే రోడ్డుపై బార్ షాపులు ఉన్నాయి. అక్కడ డివైడర్ ఉన్నా రాకపోకలకు అవకాశం కల్పించారు. బస్సు దిగిన వెంటనే కాలనీలోకి వెళ్లే వారు ఇబ్బందులు పడుతున్నారు. కొందరు చేసేది ప్రమాదకరంగా ఉన్న డివైడర్‌ను ఎక్కి రోడ్డు దాటుతున్నారు. వికలాంగులు చేసేది లేక రాంగ్‌రూట్‌లో నడుచుకుంటూ వెళ్లి రోడ్డు దాటుతున్నారు. వికలాంగుల పరిస్థితి చూసైన సంబంధిత అధికారులు రోడ్డు దాటేందుకు 5అడుగుల డివైడర్‌ను తొలగించాలని కాలనీవాసులు కోరుతున్నారు.



సూరారం నారాయణ హాస్పిటల్ వద్ద రోడ్డు దాటేందుకు డివైడర్ ఎక్కుతున్న దృశ్యం

'ఆమ్‌వాలీ దిల్‌దారీ' లో నాగ్

సాక్షి, సిటీబ్యూరో: శీతలపానీయం మాజా, కోకోకోలా ఇండియా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'ఆమ్ వాలీ దిల్‌దారీ బినా నామ్ వాలీ దిల్ దారీ' ప్రచారంలో టాలీవుడ్ హీరో నాగార్జున భాగం పంచుకుంటున్నారు. ఈ విషయాన్ని బ్రాండ్ నగర ప్రతినిధులు ఓ ప్రకటనలో తెలిపారు. బాలీవుడ్ నటుడు అమితాబ్ బచ్చన్, నటి పూజా హెగ్డేలతో పాటు నాగార్జున కూడా దీనిలో పాలు పంచుకుంటున్నారని పేర్కొన్నారు.

క్రైం కార్నర్..

తాళం వేసిన ఇంటికి కన్నం

రూ.7లక్షల నగదు,10తులాల బంగారం చోరీ

జీడిమెట్ల: ఓ ఇంట్లో దొంగలు పడి నగదుతో పాటు బంగారం దోచుకెళ్లిన సంఘటన జీడిమెట్ల పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ పవన్ వివరాల ప్రకారం.. చింతల్ శివనగర్‌కు చెందిన మనోహర్ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. కాగా మనోహర్ ఇటీవల బహదూర్‌పల్లిలో కొత్త ఇంటిని నిర్మించుకున్నాడు. మంగళవారం కొత్త ఇంటి గృహప్రవేశం ఉండటంతో మనోహర్ తాను ఉంటున్న చింతల్ ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి కొత్త ఇంటికి వెళ్లాడు. మంగళవారం కొత్త ఇంటిలోనే ఉన్నారు.

- బుధవారం ఉదయం మనోహర్‌కు పక్క ఇంట్లో ఉండే వ్యక్తి ఫోన్‌చేసి మీ ఇంటి తాళాలు పగులగొట్టి ఉన్నాయని సమాచారం అందించాడు. వెంటనే ఇంటికి చేరుకున్న మనోహర్ లోపలికి వెళ్లి చూడగా కబోర్డ్ తెరచి ఉంది. అందులో ఉన్న రూ.7లక్షల నగదుతో పాటు 10తులాల బంగారు నగలు కనిపించలేదు. మనోహర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. దొంగతనం చేస్తున్న తీరు సీసీ కెమెరాలో రికార్డు అయ్యిందని పోలీసులు తెలిపారు.



గ్యాస్ కనెక్షన్ ఇచ్చిన గంటల్లోనే ప్రమాదం

- గ్యాస్ లీకై అగ్నిప్రమాదం
- తండ్రి కూతురికి అంటుకున్న మంటలు
- అపార్ట్‌మెంట్ వాసులు రావడంతో ప్రాణాలతో బయటపడ్డ ఇద్దరు

జీడిమెట్ల: గ్యాస్ లీకవడంతో తండ్రి కూతురు గాయాలపాలైన సంఘటన జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. కుత్బుల్లాపూర్ హ్యాపీనెస్ట్ అపార్ట్‌మెంట్‌లోని ఓ ఫ్లాట్‌లో సంతోషి అనే మహిళ ఒంటరిగా ఉంటోంది. సంతోషి తండ్రి లక్ష్మయ్య(75) పది రోజుల క్రితం కూతురు వద్దకు వచ్చాడు. బుధవారం మధ్యాహ్నం ఇంట్లో సంతోషి పనులు చేసుకుంటుండుంగా తండ్రి లక్ష్మయ్య పూజ గదిలో జపం చేసుకుంటున్నాడు. గ్యాస్ లీక్ అవడంతో వంటగది పక్కనే పూజగది ఉండటంతో మంటలు వ్యాపించి వారికి మంటలు అంటుకున్నాయి. దీంతో వారు అరవడంతో అపార్ట్‌మెంట్ వాసులు వచ్చి మంటలను ఆర్పివేశారు. లక్ష్మయ్య, సంతోషిని సుచిత్రలోని ఓ ప్రైవేట్ అస్పత్రికి తరలించారు. లక్ష్మయ్యకు 70శాతం, సంతోషికి 40శాతం గాయాలయ్యాయి. సంతోషి ఫిర్యాదు మేరకు జీడిమెట్ల పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గ్యాస్ ఏజెన్సీపై అనుమానం..

సంతోషి ఇంటికి బుధవారం కొత్తగా గ్యాస్ ఏజెన్సీ వారు గ్యాస్ కనెక్షన్ ఇచ్చి వెళ్లారు. వారు వెళ్లిన రెండు గంటల్లోనే ప్రమాదం జరిగింది. దీంతో సంతోషి కుటుంబ సభ్యులు గ్యాస్ ఏజెన్సీపై అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

కొంపల్లి మున్సిపాలిటీలో..

రోడ్లు, డ్రైనేజీ, వీధికుక్కల సమస్యలు

- మున్సిపల్ బీజేపీ అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి
- సమస్యలు పరిష్కరించాలని కమిషనర్‌కు వినతి



కొంపల్లి మున్సిపల్ కమిషనర్ శ్రీహరికి వినతి పత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

కుత్బుల్లాపూర్: కొంపల్లి మున్సిపాలిటీలో నెలకొన్న సమస్యలపై గురువారం బీజేపీ నాయకులు కమిషనర్ సత్యనారాయణను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కొంపల్లి మున్సిపల్ బీజేపీ అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు, కౌన్సిలర్ రాజిరెడ్డి మాట్లాడారు. మున్సిపాలిటీలో రోడ్లు, వీధికుక్కలు, డ్రైనేజ్ సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతునారని తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు.

- ముఖ్యంగా ఎన్‌సీఎల్ నార్త్ నుంచి నోబుల్ ఎన్‌క్లేవ్‌కు వెళ్లేదారిలో డ్రైనేజీ లైన్ కోసం రోడ్డు తవ్వి సంవత్సరం పూర్తయిన ఇంకా ప్యాచ్ వర్క్‌లు చేపట్టకపోవడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారని కమిషనర్ దృష్టికి తీసుకు వెళ్లారు. ఈ రోడ్డులో ప్రతినిత్యం వందల సంఖ్యలో ద్విచక్ర వాహనాలు, స్కూల్ బస్సులు ప్రయాణం సాగిస్తుంటాయని అన్నారు. వాహనాలపై పిల్లలను స్కూళ్లకు తీసుకువెళ్లే క్రమంలో అవి అదుపు తప్పి ప్రమాదాల బారిన పడుతున్నారని తెలిపారు.
- మున్సిపాలిటీ పరిధిలో వీధి కుక్కల బెడద తీవ్ర రూపం దాల్చిందన్నారు. ఎన్‌సీఎల్ కాలనీ, నోబల్ ఎన్‌క్లేవ్‌లో పలువురు కుక్కల దాడిలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రుల పాలైన ఘటనలు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ విషయమై సాక్షి దినపత్రికలో సైతం వరుస కథనాలు ప్రచురితమయ్యాయని కమిషనర్ దృష్టికి తీసుకొచ్చారు.
- గతంలో సైతం బీజేపీ ఆధ్వర్యంలో ఫిర్యాదు చేసినా ఇంత వరకు చర్యలు తీసుకున్న దాఖలాలే లేవని ఇప్పటికైనా స్పందించాలని కోరారు. దీనిపై స్పందించిన కమిషనర్ శ్రీహరి 15 రోజుల్లో రోడ్డుకు ప్యాచ్ వర్క్‌లు పూర్తి చేస్తామన్నారు. స్పెషల్ డ్రైవ్ చేపట్టి వీధి కుక్కలను కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్స కేంద్రానికి తరలిస్తామని హామీ ఇచ్చారు. మేడ్చల్ జిల్లా ఓబీసీ మోర్చా జనరల్ సెక్రటరీ సతీష్ సాగర్, జిల్లా కార్యాలయం ఇన్‌చార్జ్ శివాజీరాజు, మహిళా మోర్చా నేతలు సరిత, మాధురి తదితరులు ఉన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220366
9912348029